చెప్పాలనుకున్నా. కానీ భయమేసిందమ్మా!''.

పొరలుపొరలుగా అతని ఏడుపు వినిపించింది. ఆమె మాత్రం తన ఏడుపును గొంతు దాటనివ్వడం లేదు.

''పోనీ.. ఎవరైనా డాక్టర్‌ని కలుద్దామా.?'' అంటూ తల నిమిరింది.

''నేను కూడా డాక్టర్‌నే అమ్మా''.

''సరే! నాకు ఏం చేయాలో, ఏమని చెప్పాలో, ఎలా ఒప్పించాలో తెలియట్లేదు. నీ ఇంటర్న్‌షిప్ అయిపోగానే ఎమ్మెస్ చేయడానికి అమెరికా వెళ్లు! అది అయిపోయే లోపు ఏదో ఒకటి చేద్దాం''.

'ప్రకృతిలో ప్రతి సమస్యకూ ఒక పరిష్కారం ఉంటది. కానీ, ప్రతిసారీ పరిష్కారం లేని ఒక సమస్య పరిష్కరించమని సవాలుగా విసురుతుంది. అదే జీవితం' అనుకొని హరిని ఓదార్చింది.

* * *

హరి ఫోన్ చేయకపోతే శారదే చేసేది. అప్పుడప్పుడూ వీడియో కాల్ కూడా. వీలైనంత నార్మల్‌గా ఉండటానికి ప్రయత్నం చేసేది. శారద వేరే విషయాలు మాట్లాడినా.. హరి తిరిగితిరిగి అక్కడికే వెళ్లేవాడు.

''అమ్మా.. డాడీకి చెప్పావా!?''.

''ఇంకా లేదు''.

'ఏమంటాడోనని భయంగా ఉందమ్మా''.

''అవన్నీ నేను చూసుకుంటానని చెప్పానుగా. నీవు నీ స్టడీస్ మీద కాన్సెంట్రేట్ చేయి. నీవు అనుకున్న హార్వర్డ్ యూనివర్సిటీలో సీటు రావాలి. సరేనా!?''.

* * *

అనుకున్నట్టుగానే హరికి హార్వర్డ్ యూనివర్సిటీలో సీటు వచ్చింది. అదే విషయం శారదకు వీడియోకాల్ చేసి చెప్పాడు. చాలా సంతోషించింది.

''అమ్మా.. ఇంటికి రావాలని ఉంది''.

''ఇప్పుడొద్దు హరి''.

''మరి ఎప్పుడమ్మా? ఇప్పుడు అమెరికా వెళ్తే.. ఎప్పుడంటే అప్పుడు రావడానికి కుదరదు''.

''ఇప్పుడు మనమున్న పరిస్థితుల్లో అదే కరెక్ట్. ఎప్పుడు రావాలో నేను చెప్పే పనిలేదు. నీకు తెలుస్తుంది.. అప్పుడు రా!''.

''అమ్మా.. నా లాఫింగ్ బుద్ధా లేదేంటి?''.

''పగిలిపోయింది. నిన్న మీ నాన్నతో గొడవైంది!''.

''అమ్మా.. ఇలా పుట్టడం నా తప్పా..!?''

''నువ్వు గైనకాలజిస్ట్‌వి కదా.. నువ్వే చెప్పు!? ఇందులో నీ తప్పు ఉందా? మా తప్పు ఉందా??''.

హరి ఏం మాట్లాడలేదు.

''నేను చెప్పనా.. ఆడవాళ్లలో ఎక్స్ క్రోమోజోమ్స్.. మగవాళ్లలో ఎక్స్ అండ్ వై రెండూ ఉంటాయి. మగవాళ్ల లోని ఎక్స్, ఆడవాళ్ల ఎక్స్‌తో కలిస్తే.. ఆడపిల్ల (ఎక్స్ ఎక్స్). మగవాళ్లలోని వై, ఆడవాళ్ల ఎక్స్ క్రోమోజోమ్‌తో కలిస్తే.. మగ పిల్లాడు(ఎక్స్‌వై) పుడతారు. ఇందులో తేడాలు వస్తే.. ఎక్స్‌ఎక్స్‌వై అండ్ ఎక్స్‌వైవైగా మారుతుంది. వాళ్లే ఈ గే, లెస్బియన్, ట్రాన్స్‌జెండర్‌లుగా పుడతారు. ఇది పుట్టుకతో కాకుండా పెరిగేకొద్దీ తెలుస్తుంది. ఇప్పుడు చెప్పు.. ఇందులో ఎవరి తప్పు ఉంది!?''.

ఇదంతా బాగానే స్టడీ చేసిందనే ఆశ్చర్యంతో అమ్మనే చూస్తున్నాడు.

''ఈ మనుషులలో ఒక భయంకరమైన రోగం ఉంది. అదేంటో తెలుసా.. పరువు. దానికోసం హత్యలు కూడా చేస్తారు. తప్పును, మార్పును ఒప్పుకోవడం ఈ సమాజానికి చేతకాదు. ఇలాంటి సమస్య వచ్చినప్పుడు ఎవరికైనా.. 'సమాజం ఏమనుకుంటుందో' అనే భయం ఉంటుంది. దాన్ని దాటుకొని 'ఏమనుకుంటే నాకెందుకు' అన్న తెగింపు రావాలి. తర్వాత అవమానపడటం అలవాటు కావాలి. ఇవన్నీ దాటుకొని రావాలంటే ఎవరికైనా కొంచెం టైమ్ పడుతుంది. అందుకే.. అప్పటి వరకూ నీ ఎమ్మెస్ చేసుకో!''.

ఆమె చదివిన సోషియాలజీ.. హరిని నార్మల్‌గా చేయడానికి పనికొస్తుందని ఎప్పుడూ అనుకోలేదు.

* * *

''ఏమంటున్నాడు.. నీ పుత్రరత్నం. అమెరికా ఎలా ఉందట?''.

''అదేదో మీరే ఫోన్ చేసి అడగొచ్చుగా''.

ఈ మధ్య శారద – చంద్రశేఖర్ మాట్లాడుకున్నా.. పోట్లాడుకున్నట్టే ఉంటున్నది.

''ఏమని మాట్లాడాలి. 'కొడుకా!' అని పిలవాలా.. 'కొజ్జా!' అని పిలవాలా.. చెప్పు'' అని అరిచాడు.

ఆమె మాత్రం నిశ్శబ్దంగా నిలబడింది.



**'నమస్తే తెలంగాణ, ముల్కనూరు సాహితీపీఠం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2023/24'లో రూ.5 వేల బహుమతి పొందిన కథ.**

ఫ్యాన్.. గడియారం శబ్దం మాత్రమే వినిపిస్తున్నాయి.

''శారదా.. మనిద్దరి అభిప్రాయాలు ఒక్కటే అన్నావ్. వాడు పుట్టినప్పుడు మన ప్రేమకు ప్రతిరూపం అన్నావ్. మన ప్రేమ అటూఇటూ కానిదై., మనల్ని ఎటూ కానివాళ్లని చేసింది. ఇప్పుడు బయట తల ఎత్తుకొని ఎలా తిరుగుతాం. ఇంత జరిగినా.. అసలు వాడితో ఎలా మాట్లాడగలుగుతున్నావ్!?''.. నిజానికి అది అతని బాధ. కానీ, మగవాడు కదా కోపంగానే చెప్పాడు. కోపంతో మొదలై.. బాధతో ఆపాడు.

''ఇప్పటికీ మన అభిప్రాయాలు ఒక్కటే! కాకపోతే మీరు సమాజం గురించి ఆలోచిస్తున్నారు. నేను నా బిడ్డ గురించి ఆలోచిస్తున్నా.. అంతే! అప్పుడు మన పేరెంట్స్ సమాజం గురించి ఆలోచించి మన పెళ్లికి ఒప్పుకోలేదు. ఇప్పుడు నీవు, వాళ్ల స్థానంలోకెళ్లి 'వద్దు' అంటున్నావ్.. నేనిప్పటికీ నా స్థానంలోనే ఉన్నా! అప్పుడు మన కోసం పోరాడా. ఇప్పుడు నా కొడుకు కోసం పోరాడుతున్నా!''.

గడియారం ఒక్క క్షణం ఆగి, శారద వైపు గర్వంగా చూసి.. మళ్లీ పరుగెడుతున్నది. చంద్రశేఖర్ చూపు తిప్పుకొని గడియారం వంక చూశాడు. అందులో అతని గతమంతా సెకన్ల ముల్లు కంటే వేగంగా తిరిగింది.

''నాకొక విషయం చెప్పండి. ఒకవేళ మనకు కుంటివాడో.. గుడ్డివాడో.. పుడితే ఏం చేసేవారు? కొందరికి కన్ను, కాలు ఉండికూడా ఎలా పనిచేయవో.. అలాంటిదే నా కొడుకు శరీరంలో ఒక అవయవం పనిచేయట్లేదు. అంతే!''.. చంద్రశేఖర్‌కు తల్లి ప్రేమ కనిపిస్తున్నది. ఆమె తల్లిగానే కాదు.. మామూలు మనిషిగా కూడా ఇలానే ఉంటుంది. ఎవరూ జీర్ణించుకోలేని వాటిని అరిగించడం ఆమె ప్రత్యేకత. చంద్ర శూన్యంలోకి వెళ్లాడు. అతని మైండ్ కాంతికంటే వేగంగా పరుగెడుతున్నది. ఆ వేగంలో అతని కన్నీళ్లు అతనికి కనిపించలేదు.

''తల్లిగా వాడి మనసుకు తగ్గ శరీరాన్ని ఇవ్వలేకపోయాను. కనీసం జీవితాన్నయినా సరిగ్గా ఇద్దాం. వాడి అవయవాల్లో లోపం ఉన్నంత మాత్రాన, మన ప్రేమలో లోపం ఉన్నట్టు కాదు!''.

కూరగాయల త్రాసు కూడా మధ్యలో నిలబడదు. దాన్ని సరిగ్గా పట్టుకోగలిగితే సగం సమస్యలు తీరినట్టే! చంద్రశేఖర్ గుండె.. రాయి నుంచి కండరంగా మారింది.

''ఒకసారి వాడికి ఫోన్ చేయి.. మాట్లాడతా!'' అంటూ, కన్నీరు తుడుచుకున్నాడు.

ఆమె ఆనందంగా ఫోన్ తీసుకుంది.

అప్పుడే హరి ఫోన్ చేశాడు.

''వాడే చేస్తున్నాడు!''..

'స్పీకర్ ఆన్ చేయి!' అన్నట్టుగా సైగ చేశాడు.

''హలో!''..

''అమ్మా!''..

పిలుపులో కాస్త భయం కనిపించింది.

''ఏమైంది హరీ!?''.

''అమ్మా.. నేను 'గే' కాదు!''..

శారద, చంద్రం.. ఆనందంతో ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు.

''నేను అమ్మాయిని''..

శారదకు సరిగ్గా అర్థంకాలేదు.

''ఏం మాట్లాడుతున్నావ్ హరి!?''.

''నిజం అమ్మా.. నేను బయటికి మగవాడిలా కనిపించినా.. నా లోపల ఆడవాళ్ల ఆర్గాన్స్ డెవలప్ అయ్యాయి. అంటే నేను 'హీఫీమేల్' అన్నమాట!''.

''అంటే ట్రాన్స్‌జెండర్ వా!?''.

'అవును' అన్నట్టుగా మూలిగాడు హరి.